# క్షీరాభిషేకం

శివాలయం. ఆలయం వెలుపల పాలులేక పసిపాప ఆక్రందన. మాఘమాసం కృష్ణపక్ష చతుర్దశి. మహాశివరాత్రి పర్వదినం. శివాలయానికి భక్త జనులు స్నానంచేసి శుచిగా వస్తున్నారు. స్త్రీలు తలంటుకుని, మొహాలకు పసుపు రాసుకుని నొసట పెద్దబొట్టు పెట్టుకుని, చేతిలో పూల సెజ్జలు ధరించి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు వేరే ప్లాస్టిక్ బేగ్స్‌లో వేసుకుని శివార్చనకు వస్తున్నారు. శివాలయం శిఖరం మీద అమర్చిన లౌడ్ స్పీకర్లలోంచి సినిమాపాటలు హోరున వినిపిస్తున్నాయి. భక్తి గీతాలు, రక్తిగీతాలు, ప్రేమగానాలు, కామగానాలు సమస్తమూను! శివాలయమంతా బాక్సాఫీసు పిక్చర్ ఆడుతున్న సినిమాథియేటరులా ఉంది. ఆలయ ప్రవేశ ద్వారానికి ఇవతల బారులు తీరుతున్న ముష్టివాళ్ళూ, వాళ్ళ పిల్లలూ పాపలూ దర్శనం అయిపోయాక భక్తులిచ్చే పైసలు, లేక ఓ కొబ్బరికాయ ముక్క కోసం పడిగాపులు పడుతున్నారు.

వాళ్ళలో ఓ పసిపాప ఆక్రందన. తల్లిదగ్గర పాలు లేవు. బిడ్డ తల్లి నోట్లో పెట్టిన స్తన్యం చీకుతూంది. చీకినప్పుడు ఏడుపు లేదు. బొజ్జ నిండడం లేదని తెలియగానే మళ్ళీ ఏడుపు. పాల చెంబుతో క్షీరాభిషేకం చేద్దామని వెళుతున్న భక్తుల్ని "కాసిన్ని పాలు పొయ్యండి అమ్మలారా, అయ్యలారా! పిల్ల సొమ్మసిల్లి పోతూంది" అని తల్లి ఎంత బ్రతిమాలినా, భగవంతుని నివేదనకి తీసుకువెళ్తున్న పాలు ఎవరు పోస్తారు? పుణ్యానికి పోతే పాపం ఎదురవదా?

సాయంత్రం ఆరునుంచి పురాణ కాలక్షేపం మొదలైంది. ఫిల్మ్ రికార్డులు

ఆపేశారు. ఖణేల్ మని కంచు గొంతుకతో పౌరాణికుడు మైకులోంచి శివపురాణ గాథలు వినిపిస్తున్నాడు. ఆలయానికి వచ్చి శివదర్శనం చేసుకోడానికి నోచుకోని దుర్బలులకు, రోగగ్రస్తులకు పౌరాణికుని గొంతుక వినబడాలి. వాళ్ళందరూ శివ గాథలు విని తరించాలి.

"భక్త జనులారా! ఈ మహా శివరాత్రిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో, శివపురాణం ఏమని చెప్పిందో వినండిః తపాంసి వివిధాన్యేన జపశ్చైవ హ్యనేకశః, నైతేన సమతాం యాంతి శివరాత్రి వ్రతేనచ' జప తప ధ్యానాదులు ఎన్ని చేసినా శివరాత్రి వ్రతాన్ని పాటించడంవల్ల వచ్చే ఇహ పర సౌఖ్యాలకు సమానం కావు.

"శివరాత్రి వ్రతాన్ని పాటించడానికి సరియైన కాలం సాయంత్రంతో ప్రారంభమై నాలుగు యామాలవరకూ అంటే మర్నాటి ఉదయం వరకూ ఉంటుంది. యామం అనగా మూడు గంటల కాలం."

"ఈ రోజు భక్తజనులు సాయంకాలం వేళ శివాలయాలకు వెళ్ళి శంకరస్వామిని దర్శించి కృతార్థు లవుతుంటారు. మరి కొందరు భక్తులు పవిత్ర నదులు ఉన్న పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ ఉంటారు. భక్త జనులు నదులలో స్నానమాడి, అక్కడే పార్థివ లింగాలను చేసి పూజలు సల్పుతారు. ఈ పవిత్ర శివరాత్రినాడు ద్వాదశ జ్యోతిర్లింగాలు గల ద్వాదశ క్షేత్రాలు సందర్శనయోగ్యాలే. ఈ ద్వాదశ జ్యోతిర్లింగాలలోనూ ఏ ఒక్క లింగాన్ని ధ్యానించినా, సందర్శించినా అత్యంత ఫలప్రదం అని శివపురాణం ప్రవచిస్తున్నది. సౌరాష్ట్ర సోమనాథుడు, శ్రీశైల మల్లికార్జునుడు, ఉజ్జయినీ మహాకాళుడు. ఓంకారేశ్వరుడు, కేదారేశ్వరుడు, ద్రాక్షారామ భీమ శంకరుడు, వైద్యనాథుడు, దారుకావన నాగేశ్వరుడు, కాశీ విశ్వనాథుడు, త్ర్యంబకేశ్వరుడు, రామేశ్వరుడు, ఘూశ్మేశుడు ఇవీ పన్నెండు జ్యోతిర్లింగాలూను."

"శివరాత్రి వ్రతాన్ని కావిద్దామనుకున్నవారు రాత్రి నాలుగు యామాల్లోనూ అర్చనలు, అభిషేకాలు చెయ్యాలి. పంచాక్షరీ మహామంత్రమైన 'నమశ్శివాయ' ఉచ్చరిస్తూ ఉండాలి. పరమేశ్వరు నుద్దేశించి కీర్తనలు, భజనలు చెయ్యాలి."

"స్కంద పురాణంలో శివుడు తానేవిధంగా ప్రసన్నుడవుతాడో చెబుతూ, తనను పవిత్ర గంగాజలంతో అభిషేకం చేసినా, నూతన వస్త్రాలతో అలంకరించినా,

ధూప దీప నైవేద్యాలు, పుష్పాలు సమర్పించినా సంతృప్తి లేదని, ఆ రాత్రి ఉపవాసముంటే చాలునని అంటాడు."

శివరాత్రినాడు ఉపవాసానికి తోడు జాగరణ కూడా చేయాలి. శైవుడైనా, వైష్ణవుడైనా, లేక ఏ ఇతర దైవారాధకుడైనా శివరాత్రి వ్రతాన్ని పూనకపోతే, తాను ఎన్నేళ్ళనుంచి చేసిన తపస్సైనా నిష్ప్రయోజనమే అని ఈశ్వర సంహిత నిర్దేశిస్తున్నది. శివకేశవులకుభేదం లేకపోవడమే ఇందుకు హేతువు. ఈ హేతుగాథ భూదేవికి మహావిష్ణువు వరాహ పురాణంలో చెబుతాడు. 'శివు డెక్కడున్నాడో అక్కడే నే నున్నాను. నే నెక్కడున్నానో శివుడూ అక్కడే ఉన్నాడు. మా ఇద్దరికీ భేదం లేదు. ఎవడు పరమశివుని పూజిస్తాడో అతడు నన్ను పూజించినట్లే'.

"శివరాత్రికి సంబంధించిన గాథలు శివపురాణంలో అసంఖ్యాకంగా ఉన్నాయి."

"గురుద్రుహుడు అనే కోయ దొర అడివికి వేటకై వెళ్ళాడు. ఆ వేళ శివరాత్రి. రాత్రి వరకు కళ్ళు కాయలు కాచేటట్లు ఎదురు చూశాడు కాని ఒక్క జంతువైనా కంటబడలేదు. ఇంటి దగ్గరేమో భార్యా బిడ్డలు ఎదురు చూస్తున్నారు. ఆకలితో. ఒక చిన్న సరస్సు ప్రక్కనే ఉన్న బిల్వవృక్షం ఎక్కి జంతువులేవైనా కనిపిస్తాయేమో అని చూశాడు. ఆ బిల్వ వృక్షం కిందనే ఏ నాటిదో ఒక శివలింగం ఉంది."

"అదే సమయంలో ఒక హరిణి నీరు తాగుదామని ఆ చిన్న సరస్సు దగ్గరకు వచ్చింది. కోయ దొర లేడిని చూచి, సాచి బాణం వేయబోయేసరికి అతని వద్ద ఉన్న సొరకాయలోని నీళ్ళుజారి శివలింగం మీద పడ్డాయి. అతని గురి తప్పింది. మళ్ళా విల్లు ఎక్కుబెట్టబోయే సరికి ఆ లేడి కోయ దొరను సమీపించి అన్నది: 'నా మాంసమే నీకు దొరికింది దొరా? నన్ను చంపి నువ్వు సుఖించవచ్చుకాని, చంపకుండా ఉంటే ఎంతో పుణ్యం నీకు."

"నా భార్యా బిడ్డలు నా మీద ఆధారభూతులై ఆకలితో మాడిపోతున్నారు. వారి ఉదరపోషణార్థం నిన్ను చంపక తప్పదు."

"అయితే నా భర్తకూ, పిల్లలకూ ఈ విషయాన్ని చెప్పి తప్పకుండా వస్తాను. లేకపోతే వాళ్ళు నా గురించి బెంగ పెట్టుకుని ఆత్మహత్య చేసుకుంటారు. ఇంటికి వెళ్ళడానికి దయచేసి నాకు అనుమతియ్యి" అని దీనంగా ప్రార్థించింది.

"కోయ దొర అనుమతించాడు. తరువాత కొంత సేపటికి మరొక లేడి వచ్చింది. దాని కథ కూడా ఇలాగే నడిచింది. కోయదొర బాణం ఎక్కుపెట్టి కొట్టబోయేసరికి అతని సొరకాయలోని నీళ్ళు, బిల్వ దళాలు ఒకేసారి కింద ఉన్న శివలింగంమీద పడ్డాయి. ఆ లేడికి కూడా మొదటిసారి వచ్చిన లేడిలాగే అనుమతి లభించింది."

"రెండు హరిణులను చంపకుండా విడిచి పెట్టినందుకు కోయ దొర పరమ శివుని అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. అదికాక తెలిసో, తెలియకో బిల్వ వృక్షం క్రింద ఉన్న శివలింగానికి బిల్వ పత్రితో పూజచేసి, తన సొరకాయలో ఉన్న నీటితో అభిషేకం చేసి, రాత్రినుండీ తెల్లవారేవరకూ జాగారం చేయడంవలన పరమశివుడు మరీ ఆనందించాడు."

"నాలుగు యామాలు అయిపోగానే పరమేశ్వరుడు ప్రత్యక్షమై చరితార్థుడవై శ్రీరాముని సేవచేసి మోక్షం సంపాదిస్తావని కోయ దొరను దీవిస్తాడు. ఈ గురుద్రుహుడనే కోయ దొరే 'గుహుడు' అనే పేరుతో శృంగిబేరి పురవాసియై శ్రీరాముని సేవచేసి గంగానదిని దాటించి ధన్యుడవుతాడు."

శివాలయంలో కరెంటు పోయింది. పౌరాణికుడు 'సాంబశివా' అంటూ ముక్కుపొడుం ఒక్కపట్టు పట్టేడు. కరెంటు వచ్చేక పురాణం పునః ప్రారంభిద్దామని ఆగేడు. విద్యుద్దీపాలు లేకపోయినా ఆలయం భాసిల్లుతూనే ఉంది. నందికేశ్వరుడి మీదా చుట్టూరా ప్రమిదలతో భక్తులు పెట్టిన దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. గర్భగృహంలో కూడా ప్రమిదలు వెలుగుతున్నాయి. ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులు ప్రమిదలు వెలిగించే ఉంచారు. నూనె అయిపోయిన వెంటనే సీసాలతో తాము తెచ్చిన నూనెను ప్రమిదలలో భక్తులు నింపుతున్నారు. వత్తులు కాలిపోగానే కొత్త వత్తులు వేస్తున్నారు. ఆలయం అంతా మహాశివరాత్రితోపాటు దీపావళి రాత్రిలా కూడా ఉంది.

బయట పాలకోసం పసిపాప ఘోష వినిపిస్తోంది. లోపల వేద ఘోష వినిపిస్తోంది. లింగోద్భవకాలం కాగానే తాము తెచ్చిన చెంబులలోని పాలు శివలింగంపై అభిషేకం చేయడానికి భక్తులు ఎదురు చూస్తున్నారు. నారికేళ జలాలతో రుద్రాభిషేకం చేద్దామని మరి కొంతమంది భక్తులు వేచి ఉన్నారు. ఒకొక్క దంపతుల జంట దగ్గర ఒకొక్క పురోహితుడు రుద్రాభిషేక మంత్రాలు

పఠిస్తున్నాడు.

కరెంటు వచ్చింది. విద్యుద్దీపాలు భాసించాయి.

పౌరాణికుడు శివ పురాణ గాథలు కొనసాగించాడు. లౌడ్ స్పీకర్‌లో పాడుం పీల్చిన చప్పుడైంది.

"భక్తులారా! గుణనిధి అనే భక్తుని గాథ వినండి!"

గుణనిధి అనే కుర్రవాడు దుర్వ్యసనాలకు దుస్సహవాసాలకు లోనై తల్లితండ్రులచేత తరిమివేయబడ్డాడు. అతడు తిండి తిప్పలు లేక ఆకలితో శివరాత్రినాడే శివాలయంలో స్వామివారి ప్రసాదం అపహరించి పొట్ట నింపుకుందామని ఎత్తువేశాడు. భక్తులు శివునికి పూజాపునస్కారాలు చేస్తూండడంవలన వాళ్ళు పూజలు ముగించుకుని వెళ్ళిపోయేవరకూ జాగరణ చేశాడు. తెల్లవారింది. భక్తులందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

గుణనిధి మెల్లగా గర్భగృహం చొచ్చి కొనప్రాణంతో ఉన్న దీపపు వత్తిని, ఒక పుల్లతో పైకి ఎగదోసి, పక్కనే ఉన్న నూనె కొంచెం పోశాడు. దేవుని ప్రసాదం కడుపునిండా తిన్నాడు.

మరణాంతంలో యమభటులు గుణనిధిని నరకానికి తీసుకువెళ్ళి శిక్షిద్దామనుకున్నారు. కానీ, శివభటులు వారిని అడ్డగించి 'గుణనిధి తెల్లవార్లూ జాగరణచేసి, దేవదేవునికి దీపం పెట్టి ప్రసాదం పుచ్చుకున్నాడు. అంచేత అతని సర్వ పాపాలూ ధ్వంసమయినాయి' అని గుణనిధిని శివ సాయుజ్యానికి గొనిపోయారు." పురాణం ముగించాడు పౌరాణికుడు.

అర్ధరాత్రి పన్నెండైంది. అదే లింగోద్భవకాలం. గుడిలోని గంటలు గణగణా మ్రోగుతున్నాయి.

భక్త జనులు చెంబులతో తాము తెచ్చిన లీటర్లకొద్దీ పాలను శివలింగంపై ఒకేసారి భళ్ళున ఒంపేసి క్షీరాభిషేకం చేసేశారు.

ఆలయం బయట పాలులేని పసిపాప ఆక్రందన చేసి చేసి శాశ్వతంగా కన్నుమూసింది.

పాలులేని పసిపాప మృత్యువును చూసి పాలతో స్నానంచేసిన మృత్యుంజయ లింగం ఫక్కున నవ్వింది!

• ఆంధ్రప్రభ వీక్లీ •

*13-8-1986*